


# బలిపీఠము

యేసయ్య పరిశుద్ధమైన నామమునకు మహిమ కలుగును గాక!

*మూలవాక్యం: మత్తయి 23:19 అవివేకులారా,అంధులారా, ఏది గొప్పది? అర్పణమా? అర్పణమును పరిశుద్ధపరచు బలిపీఠమా?*

బలిపీఠం అనగా బలి అర్పించే ప్రదేశం.యాజకుడు పాపి పక్షముగా దేవునికి అర్పణలు సమర్పించే ప్రదేశం. ఇక్కడ మనకు పాప క్షమాపణ, పాప విమోచన దొరుకుతుంది. అయితే పరిశుద్ధ గ్రంధంలో చాల సార్లు దేవుని ప్రజలు బలిపీఠములు కట్టిన సందర్భాలు ఉన్నాయి. కొందరు దేవుడు తనతో మాట్లాడినదానికి గుర్తుగా బలిపీఠములు కట్టారు. మరికొందరు దేవుడు తమ జీవితాల్లో చేసిన గొప్ప కార్యములను బట్టి బలిపీఠములు కట్టారు. ఇంకొంత మంది అయితే దేవునితో వారికున్న సహవాసనికి గుర్తుగా బలిపీఠములు కట్టారు.

ఇక్కడ మనం జాగ్రత్తగా గమనిస్తే ఈ ప్రక్రియలో పాపి – యాజకుడు - దేవుడు ఉన్నారు. ఈ యాజకుడు బలిపీఠం మీద కట్టెలు క్రమంగా పేర్చి బలి పశువును కట్టెల మీద ఉంచి, కత్తితో ఆ బలి పశువును వధించాలి. ఆ తర్వాత నిప్పుతో దాన్ని బలిపీఠం మీద దహించి వేయాలి. అయితే ఆ బలి పశువుని మాత్రం పాపి యాజకుని యొద్దకు తీసుకెళ్లాలి. యాజకుడు మాత్రమే బలి అర్పణ దేవునికి అర్పించాలి.

పరిశుద్ధ గ్రంధంలో కొన్ని ప్రత్యేకమైన అర్పణలు ఉన్నాయి. వాటిలో కొన్ని చూద్దాం. పరిశుద్ధ గ్రంధంలో చెప్పబడిన మొట్ట మొదటి బలిపీఠం. నోవహు కట్టినది. ఆది 8:20 అప్పుడు నోవాహు యెహోవాకు బలిపీఠము కట్టి, పవిత్ర పశువులన్నిటిలోను పవిత్ర పక్షులన్నిటిలోను కొన్ని తీసుకొని ఆ పీఠముమీద దహన బలి అర్పించెను. దేవుడు జల ప్రళయం నుండి తన కుటుంబాన్ని రక్షించిన దానికి గుర్తుగా కట్టిన బలిపీఠం. కాని కయీను, హేబేలు కూడా దేవునికి బలులు అర్పించినట్లు మనం గమనించవచ్చు. మరి అక్కడ యాజకుడు ఎవరు? బలిపీఠం ఎవరు కట్టారు? ఇలాంటి కొన్ని ప్రత్యేకమైన సందర్భాలను మనం గమనిద్దాం.

I. *ఏమి లేవు అయినా బలి అర్పణ జరిగింది: ఆది 3:21* దేవుడైన యెహోవా ఆదామునకును అతని భార్యకును చర్మపు చొక్కాయిలను చేయించి వారికి తొడిగించెను.

*ఏమి లేవు, అయినను బలి అర్పణ జరిగింది. దేవుడు ఆదాము హవ్వలకి చర్మపు చొక్కాయిలు ఇవ్వాలంటే ఖచ్చితంగా ఏదో ఒక ఒక పశువు బలి అయ్యి ఉండాలి.*

1. మరి ఆ బలి పశువు ఎవరు?
2. యాజకుడు ఎవరు? ఆదాము,హవ్వ తప్ప ఇంకెవ్వరు లేరు కదా?
3. కట్టెలు ఎక్కడివి ఏదేను తోటలో అంతా పచ్చదనమే, జీవ జల నదులు ఉన్న ప్రాంతం.
4. బలి పశువు వధించడానికి అవసరమైన కత్తి ఎక్కడిది?
5. మరి పశువును కాల్చడానికి నిప్పు ఎక్కడిది?

ఎందుకు బలి జరగాలి అంటే, దేవుని ఆజ్ఞను మీరి ఆదాము, హవ్వ పాపము చేసి, దేవుని నుండి వేరై ఆత్మీయంగా మరణించారు. మరి దేవుడైతే మనిషితో సహవాసం కోరుకున్నారు. మనిషి పాపం చేసి ఆ ధన్యత కోల్పోయాడు.

**కాబట్టే దేవుడు వారికి భౌతికమైన శిక్ష వేసి, ఆత్మీయంగా తానే బలి పశువు అయ్యాడు. ఇక్కడ యాజకుడు, బలి పశువు ఆయనే. ఆయన ఆ బలికి అవసరమైన సమస్తం సమకూర్చారు. ఆయనే ఆ సమస్తం అయ్యాడు. వారికి రక్షణ వస్త్రాలు ఇచ్చారు.**

**II.** ***గొర్రె పిల్ల లేదు అయిన బలి అర్పణ జరిగింది:*** *ఆది 22:7* ఇస్సాకు తన తండ్రియైన అబ్రాహాముతో నా తండ్రీ అని పిలిచెను; అందుకతడు ఏమి నా కుమారుడా అనెను .అప్పుడతడు నిప్పును కట్టెలును ఉన్నవి గాని దహనబలికి గొఱ్ఱపిల్ల ఏది అని అడుగగా

*అబ్రాహము విషయంలో దేవుడు బలి పశువుగా ఇస్సాకుని అడిగినప్పుడు అబ్రాహము కుమారుడిని ఆయన ఆత్మీయంగా బలి ఇచ్చేశాడు. కాని, ఈ సందర్భంలో దేవుడే బలికి బలి పశువును చూసుకున్నారు అని వాక్యం చెప్పుతుంది. అందుకే ఆ చోటికి యెహోవా యీరే అని పేరు పెట్టారు. ఆ మాటకు అర్థం దేవుడే చూచుకొనును అని He will take care of every thing అని అర్థం. అప్పుడే అబ్రాహామును దేవుడు melchitsedek మెల్కీసెదెక్ (నీతికి రాజు) క్రమంలోకి నడిపించారు. రొట్టె, ద్రాక్షరసం ఇచ్చారు.హెబ్రీ భాషలో మేలేఖ్ అనగా రాజు. సాదిక్ అనగా నీతి. మెల్కీసెదెక్ అనగా నీతికి రాజు, సమాధానానికి రాజు, శాంతికి రాజు యేసయ్య*

**III.** ***బలికి అక్కడ ఎద్దులు లేవు అయిన బలి అర్పణ జరిగింది:***

*1 సము 6:7,14* కాబట్టి మీరు క్రొత్త బండి ఒకటి చేయించి, కాడిమోయని పాడి ఆవులను రెంటిని తోలితెచ్చి బండికి కట్టి వాటి దూడలను వాటి దగ్గరనుండి యింటికి తోలి, యెహోవా మందసమును ఆ బండిమీద ఎత్తి అపరాధార్థముగా ఆయనకు మీరు అర్పింపవలసిన బంగారపు వస్తువులను దాని ప్రక్కనే చిన్న పెట్టెలో ఉంచి అది మార్గమున పోవునట్లుగా విడిచిపెట్టుడి. ఆ బండి బేత్షెమెషు వాడైన **యెహోషువ యొక్క పొలములోనికి వచ్చి అక్కడనున్న ఒక పెద్ద రాతి దగ్గర నిలువగా, వారు బండి యొక్క కఱ్ఱలను చీల్చి ఆవులను యెహోవాకు దహన బలిగా అర్పించిరి.**

నిర్గమ 13:15 ఫరో మనలను పోనియ్యకుండ తన మనస్సును కఠినపరచుకొనగా యెహోవా మనుష్యుల తొలి సంతానమేమి జంతువుల తొలి సంతానమేమి ఐగుప్తుదేశములో తొలి సంతాన మంతయు సంహరించెను. **ఆ హేతువు చేతను నేను మగదైన ప్రతి తొలిచూలు పిల్లను యెహోవాకు బలిగా అర్పించుదును;** అయితే నా కుమారులలో ప్రతి తొలి సంతానము వెలయిచ్చి విడిపించుదునని చెప్పవలెను.

ద్వితీ 16:2 యెహోవా తన నామమును స్థాపించుటకై ఏర్పరచుకొను స్థలములోనె **నీ దేవుడైన యెహోవాకు పస్కాను ఆచరించి, గొఱ్ఱ మేకలలో గాని గోవులలోగాని బలి అర్పింపవలెను.**

*కాడి మోపని పాడి ఆవులు బలిపీఠం మీద బలి అయ్యాయి. బండికి సాధారణంగా ఎద్దులను కడతారు. ఇక్కడైతే ఆవులని కట్టారు. అవి కూడా పాడి ఆవులు.అంటే వాటికి దూడలు ఉన్నాయి. వాటికి పాలిచ్చే తల్లులు ఇవి. దేవుని పనిచేసే అవకాశం వస్తే వదులుకోవద్దు. కుటుంబాన్ని సైతం విడిచి వెళ్లి దేవుని పనిచేయాలి. ఈ పాడి ఆవులు రాజ వీధులలో కేకలతో (స్తుతులతో) యెహోవా మందసమును ఉల్లాసంగా మోసుకొని పోయి, ఆ పొలములో ఉన్న బలిపీఠం దగ్గర ఆగాయి. దేవుని కోసం దహన బలి అయ్యాయి. మనం కూడా ఈ పాడి ఆవులు ఏవిధంగా అయితే ఎద్దులు చేయవలసిన పని చేశాయో మనం కూడా అవకాశం వచ్చిన ప్రతిసారి దేవుని మందిరంలో పని చేయాలి. మాములుగా దహన బలికి గొర్రెలు, మేకలు, ఎద్దులు తీసుకోమని దేవుడు చెప్పాడు.*




*కాని ఈ పాడి ఆవులు ఇక్కడ దహనబలి అయినట్లు మనం చూస్తున్నా ం. యేసయ్య రాజ్య విస్తరణలో సువార్త ప్రకటన సేవకులు చేస్తారులే, పాస్టర్స్ చూసుకుంటారులే అంటే కుదరదు. మనం కూడా దేవునికి సాక్షిగా, అవసరమైతే హత సాక్షిగా అవ్వడానికి సిద్ధపడాలి. క్రీస్తుతో కూడా సువార్తలో వెంబడించింది స్త్రీలే. ఆస్తులతో ఉపచారం చేసింది కూడా స్త్రీలే.*

**IV.** ***అగ్ని లేదు అయిన బలి అర్పణ జరిగింది:***

*1 రాజులు 18 :30, 38* అప్పుడు ఏలీయా - నా దగ్గరకు రండని జనులందరితో చెప్పగా జనులందరును అతని దగ్గరకు వచ్చిరిఅతడు క్రింద పడ ద్రోయబడియున్న యెహోవా బలిపీఠమును బాగుచేసి , **అతడు ఈలాగున ప్రార్థన చేయుచుండగా యెహోవా అగ్ని దిగి, దహనబలి పశువును కట్టెలను రాళ్లను బుగ్గిని దహించి కందకమందున్న నీళ్లను ఆరిపోచేసెను.**

**V.** ***బలిపశువు లేదు అయినా బలి అర్పణ జరిగింది:***

*న్యాయాధి11:31* నేను అమ్మోనీయులయొద్ద నుండి క్షేమముగా తిరిగివచ్చునప్పుడు నన్ను ఎదుర్కొనుటకు **నా యింటి ద్వారమునుండి బయలుదేరి వచ్చునదేదో అది యెహోవాకు ప్రతిష్ఠితమగును; మరియు దహన బలిగా దాని నర్పించెదననెను.**

***యెహోవాకు ప్రతిష్టితము:***

*న్యాయాధి11:35,36,39* కాబట్టి అతడు ఆమెను చూచి, తన బట్టలను చింపు కొని అయ్యో నా కుమారీ, నీవు నన్ను బహుగా క్రుంగచేసితివి, నీవు నన్ను తల్లడింపచేయువారిలో ఒకతెవైయున్నావు; నేను యెహోవాకు మాట యిచ్చియున్నాను గనుక వెనుక తీయలేననగా
ఆమెనా తండ్రీ, యెహోవాకు మాట యిచ్చి యుంటివా? నీ నోటినుండి బయలుదేరిన మాట చొప్పున నాకు చేయుము; యెహోవా నీ శత్రువులైన అమ్మోనీయులమీద పగతీర్చుకొనియున్నాడని అతనితో ననెను. **ఆ రెండు నెలల అంతమున ఆమె తన తండ్రియొద్దకు తిరిగి రాగా అతడు తాను మ్రొక్కుకొనిన మ్రొక్కుబడిచొప్పున ఆమెకు చేసెను.**
**దేవునికి ఇచ్చిన మాట కోసం బలి పశువుగా తన బిడ్డని సైతం ఇచ్చిన యెఫ్తా మనకు మాదిరి.**
**దేవునికి తన తండ్రి ఇచ్చిన మాట కోసం తాను బలి పశువుగా మారడానికి సిద్ధపడిన యెఫ్తా కుమార్తె మనకు మాదిరి.ఇది యెహోవాకు ప్రతిష్టితమైన జీవితం.**

**VI.** ***అహరోను కుమారులు వేరొక అగ్ని:***

*లేవి 10:1,2* అహరోను కుమారులైన నాదాబు అబీహులు తమ తమ ధూపార్తులను తీసికొని వాటిలో నిప్పులుంచి వాటి మీద ధూపద్రవ్యమువేసి, యెహోవా తమ కాజ్ఞాపింపని **వేరొక అగ్నిని ఆయన సన్నిధికి తేగా యెహోవా సన్నిధి నుండి అగ్ని బయలుదేరి వారిని కాల్చివేసెను; వారు యెహోవా సన్నిధిని మృతి బొందిరి.**
**దహనబలి ఇవ్వడానికి పరిశుద్ధ అగ్ని కావాలి. అన్యాగ్ని కాదు. అహరోను కుమారులు క్రమం తప్పారు. చనిపోయారు. దేవుని పనిని క్రమంగా చేయాలి. క్రమమైన జీవితం, ప్రార్థన కలిగి ఉండాలి.**

**VII.** ***యాజకుడు లేడు అయినా బలి అర్పణ జరిగింది:***

*1 సము 13:8,12,13* సమూయేలు చెప్పినట్టు అతడు ఏడు దినములు ఆగి సమూయేలు గిల్గాలునకు రాకపోవుటయు, జనులు తన యొద్దనుండి చెదరిపోవుటయు చూచి

ఇంకను యెహోవాను శాంతిపరచక మునుపే ఫిలిష్తీయులు గిల్గాలునకు వచ్చి నామీద పడుదురనుకొని నా అంతట నేను సాహసించి దహనబలి అర్పించితిననెను. అందుకు సమూయేలు ఇట్లనెను నీ దేవుడైన యెహోవా నీ కిచ్చిన ఆజ్ఞను గైకొనక నీవు అవివేకపు పని చేసితివి; నీ రాజ్యమును ఇశ్రాయేలీయుల మీద సదాకాలము స్థిరపరచుటకు యెహోవా తలచి యుండెను; అయితే నీ రాజ్యము నిలువదు.

సమూయేలు యాజకుడు. సౌలు రాజు మాత్రమే యాజకుడు కాదు. యాజకుని పని యాజకుడు చేయాలి తప్ప రాజు కాదు. యాజకుడు దేవునిచే ఏర్పాటు చేయబడిన వాడు. అలాంటి యాజకుని పనిని ఆలస్యం అనే కారణంగా రాజు చేయబోయి రాజ్యాన్ని పోగొట్టుకున్నాడు. మీరు కూడా జాగ్రత్త సుమా! సేవకులు చేయాల్సిన పనిలో మీరు తలదూర్చకూడదు. శాపగ్రస్తులు కాకూడదు.

### బలిపీఠము మారిపోయింది:

1 రాజులు 11:6 -13 ఈ ప్రకారము సొలొమోను యెహోవా దృష్టికి చెడు నడత నడచి తన తండ్రియైన దావీదు అనుసరించినట్లు యథార్థహృదయముతో యెహోవాను అనుసరింపలేదు.

సొలొమోను కెమోషు అను మోయాబీయుల హేయమైన దేవతకును మొలెకు అను అమ్మోనీయుల హేయమైన దేవతకును యెరూష లేము ఎదుటనున్న కొండమీద బలిపీఠములను కట్టించెను. తమ దేవతలకు ధూపము వేయుచు బలుల నర్పించుచుండిన పరస్త్రీలైన తన భార్యల నిమిత్తము అతడు ఈలాగుచేసెను. ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా అతనికి రెండు మారులు ప్రత్యక్షమై నీవు ఇతర దేవతలను వెంబడింప వలదని అతనికి ఆజ్ఞాపించినను సొలొమోను హృదయము ఆయన యొద్దనుండి తొలగిపోయెను;యెహోవా తన కిచ్చిన ఆజ్ఞను అతడు గైకొనకపోగా యెహోవా అతని మీద కోపగించి సెలవిచ్చినదేమనగా నేను నీతో చేసిన నా నిబంధనను కట్టడలను నీవు ఆచరింపక పోవుట నేను కనుగొనుచున్నాను గనుక యీ రాజ్యము నీకుండకుండ నిశ్చయముగా తీసివేసి నీ దాసునికిచ్చెదను. అయినను నీ తండ్రియైన దావీదు నిమిత్తము నీ దినముల యందు నేను ఆలాగున చేయక నీ కుమారుని చేతిలోనుండి దాని తీసివేసెదను. రాజ్యమంతయు తీసివేయను; నా దాసుడైన దావీదు నిమిత్తమును నేను కోరుకొనిన యెరూషలేము నిమిత్తమును ఒక గోత్రము నీ కుమారునికిచ్చెదను.

ఎప్పుడైతే దేవుని బలిపీఠములను అన్య దేవతల బలిపీఠములుగా మార్చారో, అప్పుడే దేవుడు తన బలిపీఠమును విడనాడినారు. మందిరమును విడిచారు. ప్రజల యందు అసహ్యపడ్డారు. అందుకే శత్రువులు మందిరములో ప్రవేశించి ధ్వంసం చేశారు. వెండి బంగారం దోచుకున్నారు దేవుని ప్రజలను బందీలుగా తీసుకెళ్లారు.

కీర్తన 16:4 యెహోవాను విడచి వేరొకని అనుసరించు వారికి శ్రమలు విస్తరించును. వారర్పించు రక్త పానీయార్పణములు నేనర్పింపను. వారి పేళ్లు నా పెదవులనెత్తను.

2 దిన 29:11 నా కుమారులారా, తనకు పరిచారకులైయుండి ధూపము వేయుచుండుటకును తన సన్నిధిని నిలుచుటకును, తనకు పరిచర్య చేయుటకును యెహోవా మిమ్మును ఏర్పరచుకొనెను గనుక మీరు అశ్రద్ధచేయకుడి.

**A. బలిపీఠం ఎందుకు మారింది. జరిగిన పొరపాట్లు ఏమిటి?.**

మలాకి 1:7 నా బలిపీఠము మీద అపవిత్రమైన భోజనమును మీరు అర్పించుచు,

ఏమి చేసి నిన్ను అపవిత్రపరచితిమని మీరందురు .యెహోవా భోజనపుబల్లను నీచపరచినందుచేతనే గదా!

**B. బలిపీఠము దేవుడు ఎందుకు విడిచినాడు:** విలాప 2:7 **ప్రభువు తన బలిపీఠము విడనాడెను.** తన పరిశుద్ధస్థలము నందు అసహ్యించుకొనెను. దాని నగరుల ప్రాకారములను శత్రువుల చేతికి అప్పగించెను వారు నియామక కాలమున జనులు చేయునట్లు యెహోవా మందిరమందు ఉత్సాహధ్వని చేసిరి.

**C. శత్రువులు సులభముగా ఇశ్రాయేలీయులను కొల్లగొట్టినారు – నియామక దినాలు**

**కీర్తన 78:57-64 మ పితరులవలె వారు వెనుకకు తిరిగి ద్రోహులైరి జౌకిచ్చు విల్లు పనికిరాకపోయినట్లు వారు తొలగి పోయిరి.**

**వారు ఉన్నతస్థలములను కట్టి ఆయనకు కోపము పుట్టించిరి విగ్రహములను పెట్టుకొని ఆయనకు రోషము కలుగ జేసిరి.**

**దేవుడు దీని చూచి ఆగ్రహించి ఇశ్రాయేలు నందు బహుగా అసహ్యించుకొనెను.**

**షిలోహు మందిరమును తాను మనుష్యులలో సంస్థాపన చేసిన గుడారమును ఆయన విడిచిపెట్టెను.**

**ఆయన తన బలమును చెరకును, తన భూషణమైన దానిని విరోధుల చేతికిని అప్పగించెను.**

**తన ప్రజలను ఖడ్గమునకు అప్పగించెను. ఆయన తన స్వాస్థ్యము మీద ఆగ్రహించెను**

**అగ్ని వారి యౌవనస్థులను భక్షించెను వారి కన్యకలకు పెండ్లిపాటలు లేకపోయెను.**

**వారి యాజకులు కత్తిపాలుకాగా వారి విధవరాండ్రు రోదనము చేయకుండిరి.**

**ఇశ్రాయేలీయులు అర్పించిన, తినిన బలులు:**

1. **అన్య దేవతలకు, పితరులు ఎరుగని దేవుళ్లకు :**

   ద్వితీ 32:17 వారు దేవత్వములేని దయ్యములకు **తామెరుగని దేవతలకు క్రొత్తగా పుట్టిన దేవతలకు తమ పితరులు భయపడని దేవతలకు బలి అర్పించిరి.**

2. **చచ్చిన వారికి :**

   కీర్తన 106:28,35 మరియు వారు బయల్పెయోరును హత్తుకొని చచ్చిన వారికి అర్పించిన బలిమాంసమును భుజించిరి. మరియు వారు బయల్పెయోరును హత్తుకొని **చచ్చిన వారికి అర్పించిన బలిమాంసమును భుజించిరి.**

3. **వేరొక దేవునికి (దయ్యములకు)**

   కీర్తన 106:37,38 మరియు వారు **తమ కూమారులను తమ కుమార్తెలను దయ్యములకు బలిగా అర్పించిరి.** నిరపరాధ రక్తము, అనగా తమ కుమారుల రక్తము తమ కుమార్తెల రక్తము ఒలికించిరి కనానుదేశపువారి బొమ్మలకు వారిని బలిగా అర్పించిరి ఆ రక్తమువలన దేశము అపవిత్రమాయెను.

4. **తమ పిల్లలను అన్య దేవతలకు అగ్నిలో పడవేసి దహించారు:**

   యిర్మీయా 7:31 నేనాజ్ఞాపించని క్రియను నాకు తోచని క్రియను వారు చేసియున్నారు **అగ్నిలో తమ కుమారులను తమ కుమార్తెలను దహించుటకు** బెన్ హిన్నోము లోయలోనున్న తోఫెతునందు బలిపీఠములను కట్టుకొనియున్నారు.

5. **దూడకు :**

   అ.కా 7:41 ఆ దినములలో **వారొక దూడను చేసికొని ఆ విగ్రహమునకు బలి నర్పించి, తమ చేతులతో నిర్మించిన వాటియందు ఉల్లసించిరి.**

**6. బల్ల మీద అపవిత్ర భోజనం :**

మలాకి 1:12 **అయితే యెహోవా భోజనపు బల్ల అపవిత్రమనియు**, దానిమీద ఉంచియున్న భోజనము నీచమనియు మీరు చెప్పుచు దానిని దూషింతురు .

***బలి ఏంటి?***

*1 సమూ 15:22* అందుకు సమూయేలు తాను సెలవిచ్చిన ఆజ్ఞను ఒకడు గైకొనుటవలన యెహోవా సంతోషించునట్లు, ఒకడు దహనబలులను బలులను అర్పించుటవలన ఆయన సంతోషించునా? ఆలోచించుము, బలులు అర్పించుటకంటె ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ల క్రొవ్వు అర్పించుటకంటె మాట వినుటయు శ్రేష్ఠము.

***బలి అంటే ఆజ్ఞను గైకొనుట, దేవుని మాట వినుట. యెహోవాకు ప్రతిష్టించిన బలిపీఠం అన్యదేవతలకి వాడకూడదు.*** **సొలోమోను అలా చేసి దేవుని ఉగ్రతకు గురయ్యాడు.**

**అర్పించే విధానం :**

1. **విరిగిన మనస్సు :** కీర్తన 51 :16,17 **నీవు బలిని కోరువాడవు కావు కోరిన యెడల నేను అర్పించుదును. దహన బలి నీకిష్టమైనది కాదు. విరిగిన మనస్సే దేవునికిష్టమైన బలులు. దేవా, విరిగి నలిగిన హృదయమును నీవు అలక్ష్యము చేయవు.**
2. **పెదవులు :** **హోషేయ 14:2** మాటలు సిద్ధ పరచుకొని యెహోవాయొద్దకు తిరుగుడి; మీరు ఆయనతో చెప్పవలసినదేమనగా మా పాపములన్నిటిని పరిహరింపుము; **ఎడ్లకు బదులుగా నీకు మా పెదవుల నర్పించుచున్నాము; నీవంగీకరింపదగినవి అవే మాకున్నవి.**
3. **స్తుతి : కీర్తన 51:15 ప్రభువా, నా నోరు నీ స్తుతిని ప్రచురపరచునట్లు నా పెదవులను తెరువుము.**
4. **ఆరాధన : కీర్తన 51: 14** దేవా, నా రక్షణకర్తయగు దేవా రక్తాపరాధమునుండి నన్ను విడిపింపుము **అప్పుడు నా నాలుక నీ నీతినిగూర్చి ఉత్సాహగానము చేయును.**
5. **కనికరము: హోషేయ 6:6 నేను బలిని కోరను గాని కనికరమునే కోరుచున్నాను, దహనబలులకంటె దేవునిగూర్చిన జ్ఞానము నాకిష్టమైనది.**

**హెబ్రీ 10:5,26** కాబట్టి ఆయన ఈ లోకమందు ప్రవేశించునప్పుడు ఈలాగు చెప్పు చున్నాడు.బలియు అర్పణయు నీవు కోరలేదు గాని నాకొక శరీరమును అమర్చితివి. మనము సత్యమునుగూర్చి అనుభవజ్ఞానము పొందిన తరువాత బుద్ధిపూర్వకముగా **పాపము చేసినయెడల పాపములకు బలి యికను ఉండదు గాని**

**ప్రక 2:14** అయినను నేను నీమీద కొన్ని తప్పిదములు మోపవలసియున్నది. అవేవనగా, విగ్రహములకు బలియిచ్చిన వాటిని తినునట్లును, జారత్వము చేయునట్లును, ఇశ్రాయేలీయులకు ఉరి యొడ్డుమని బాలాకునకు నేర్పిన బిలాము బోధను అనుసరించు వారు నీలో ఉన్నారు.

**జిహ్వ బలులు రోజుకి 7 మార్లు స్తుతి, 3 సార్లు ప్రార్ధన శ్రద్ధగా అర్పించాలి. యెహోవా కార్యములు అశ్రద్ధగా చేయువాడు శాపగ్రస్తుడు. శ్రద్ధగా చేసి ధన్యుడవు కమ్ము, ఆశీర్వదించబడినవాడవు కమ్ము. ఆలాగు చేయడానికి పరిశుద్ధాత్మ దేవుడు మనకు సహాయం దయచేయును గాక!**

**ఆమేన్...! ఆమేన్...! ఆమేన్...!**